క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన ఎంపీపీ



ములుగు: హనుమకొండ జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్ దంపతులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ములుగు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. కాగా, ఎంపీపీ జన్మదినం అని తెలుసుకున్న మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత



ఏటూరునాగారం: రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఐటీడీఏ పరిధిలోని మహదేవ్‌పూర్‌కు చెందిన రాధకు రూ.20వేల చెక్కును సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ ఏపీఓ వసంతరావు అందజేశారు. గిరిజన సహకార సంస్థలో గతంలో సేల్స్‌మెన్‌గా పనిచేసిన వెంకటయ్య మృతి చెందడంతో జీసీసీ ద్వారా వచ్చిన ఎక్స్‌గ్రేషియా చెక్కును ఏపీఓ అందజేశారు. ఆయన వెంట జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, డీడీ పోచం ఉన్నారు.

లా కాలేజీ ఏర్పాటు చేయాలి

వెంకటాపురం(కె): భద్రాచలం కేంద్రంగా ప్రభుత్వ లా కాలేజీని ఏర్పాటు చేయాలని ఆదివాసీ సీనియర్ నాయకుడు పూనెం సాయి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో లా కాలేజీని ఏర్పాటు చేసినట్లైతే ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు విద్య అందుబాటులోకి వస్తుందని అన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక లా విద్యకు చాలా మంది దూరం అవుతున్నారని అన్నారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రం ఏర్పాటు



వాజేడు: మండల పరిధిలోని దూలాపురం గ్రామ పంచాయతీలో సోమవారం ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2015కు ముందు ఆధార్ కార్డులు పొందిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా అప్‌డేట్ చేయించుకోవాలని నిర్వాహకుడు సూచించాడు.

గుడుంబా స్వాధీనం



ఏటూరునాగారం: గుడుంబాను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఏటూరునాగారం ఎక్సైజ్ సీఐ అశోక్ సోమవారం రాత్రి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రొయ్యూర్ గ్రామానికి చెందిన దొంగిరిగట్టయ్య, దొంగిరి వెంకటేష్ 15 లీటర్ల గుడుంబాను ఏటూరునాగారం తరలిస్తుండగా మార్గమధ్యలో పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి గుడుంబాను స్వాధీనంచేసుకొనికేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు వీరన్న, నవీన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాజేడుకు 108 వాహనం



వాజేడు: మండల కేంద్రంలో సోమవారం 108 అంబులెన్స్‌కు భవనం ఏర్పాటు చేశారు. 108 అంబులెన్స్ మంజూరు అయినప్పటికీ భవనం లేక పోవడంతో మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో ఇన్ని రోజులు ఉంచారు. మండల కేంద్రంలోని ఐకేపీలో గదిని చూపించడంతో సోమవారం జెడ్పీటీసీ పుష్పలత, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, వైద్యులు, సిబ్బంది వాహన్ని వాజేడుకు తీసుకువచ్చారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ములుగు రూరల్: మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి



ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న తాటి కృష్ణ

ములుగు రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి యాపలగడ్డలో జరిగిన ప్రజా గోస- బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతు రుణ మాఫీ, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం, నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ తదితర హామీలను విస్మరించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, జవహర్, వాసుదేవరెడ్డి, రాకేష్‌రెడ్డి, కొత్త సురేందర్, బైకాని మహేందర్ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

ఎస్ఎస్‌తాడ్వాయి: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలో రావడం ఖాయమని ఆ పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటికృష్ణ అన్నారు. మండలంలోని గంగారంలో సోమవారం శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ గొప్పస్వామి అధ్యక్షతన జరిగిన ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యమాలతో సాధించుకున్న రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజలను మాయమాటలతో మరోసారి అధికారం చేపట్టాలని సీఎం కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే దళిత బంధు, గిరిజన బంధు పథకాల పేరుతో ఎస్సీ,ఎస్టీ ప్రజలను తమ వైపు ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తూ, మోసం చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీకి భారతదేశ ప్రజలే కుటుంబమని, కేసీఆర్‌కు మాత్రం ఆయన కుటుంబ సభ్యులే ముఖ్యమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు చందా మహేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా హనుమంత రెడ్డి, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షులు లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు.

7నుంచి నాగులమ్మ జాతర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, తదితరులు

మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీనర్సాపురంలోని నాగులమ్మ ఆలయంలో మార్చి 7 నుంచి 11వ తేదీ వరకు జరుగనున్న నాగులమ్మ మహాజాతర వాల్ పోస్టర్లను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ, ప్రధాన పూజారి (నాగులమ్మ ఉపాసకుడు) బాడిష రామకృష్ణ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి నాగులమ్మ అమ్మవారికి ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయ పద్ధతిలో జాతర నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతర కార్యక్రమంలో భాగంగా మార్చి 7న మంగళవారం మండెమెలుగె కార్యక్రమంతో జాతర ప్రారంభమవుతుందన్నారు. 8న బుధవారం ఆలయ సమీపంలోని ఝిరెట్టల గుట్ట వద్ద సడాలమ్మ పూజారులు కొమరం నితిన్, ధనలక్ష్మి గిరిజన సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించి అమ్మవారిని ఆలయంలోని గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. 9 గురువారం గండొరైగుట్ట వద్ద నాగులమ్మ పూజారి బాడిష నాగరమేష్, వడ్డెలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ఆలయానికి తీసుకువచ్చే క్రమంలో నాగులమ్మ, వనదేవతకు ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే రోజు అగ్ని గుండంలో ఒంటి గంట నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు అగ్ని గుండంలో నడుస్తారు. 10న భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుట, 11న సాయంత్రం సడాలమ్మ, నాగులమ్మ, వనదేవత వనప్రవేశంతో జాతర ముగుస్తుందన్నారు. కాగా ఆలయంలో ఆరు రోజుల పాటు ఆదివాసీ గిరిజన సంస్కృతి సాంప్రదాయలకు అద్దం పట్టే విధంగా అత్యంత వైభవంగా జరిగే జాతరలో భక్తులకు వినోదాన్ని పంచేందుకు 9న రాత్రి 8.30 గంటల నుంచి ఫోక్ డ్యాన్సర్ జానులిరితో ప్రత్యేక జానపద నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాడిష నాగరమేష్, కొమరం ధనలక్ష్మి, బాడిష నవీన్, ముయబోయిన శివ, సోడి శ్రీను, కొమరం గాయత్రి, కుర్సం హేమలత, కొమరం పాపారావు, ఇర్ప నాగలక్ష్మి, బాడిష నవీన్, బాడిష లక్ష్మి, స్వరూప, కొమరం మాధవరావు, పూజారులు, వడ్డెలు మడకం లక్ష్మయ్య, సోడి సత్యం, కుర్సం పుల్లయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ములుగు రూరల్(గోవిందరావుపేట): వైద్య విద్యార్థినీ దారవత్ ప్రీతిది ఆత్మహత్య కాదు ముమ్మాటికి హత్యే అని ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు లాకావత్ నర్సింహనాయక్ తెలిపారు. సోమవారం మండలకేంద్రంలో జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రీతి మృతి కారణమైన సైఫ్‌ను ఉరితీయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. ప్రీతి కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. అజ్మీరా సురేష్, రాజు, వెంకటస్వామి, దేవిసింగ్, రఘురాం, శ్రీరాములలు, తులసిరాం, సూర్య పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ములుగు రూరల్: అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణస్వామికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నాలుగు సంవత్సరాల క్రితం మంజూరు చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం ఇప్పటి వరకు పూర్తి కాలేదని అన్నారు. జిల్లాకు మంజూరు అయిన 96 ఇళ్లను నిరుపేదలకు కేటాయించాలని అన్నారు. నిర్లక్ష్యంగా నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు. రత్న, జరీనా, సువార్ల, షమీనా, విజయ, రాజు, సులోచన, రమ ఉన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

వెంకటాపురం(కె): మండలంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాత్రాపురం గ్రామంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. పాత్రాపురం పంచాయతీలో 1565 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 170 మందికి రీడింగ్ గ్లాస్‌లను అందజేశామని తెలిపారు. 200 మందికి దగ్గర, దూరం చూపు కంటి అద్దాలకు ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. 135 మందికి రిజినల్ ప్రో ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు వెల్లడించారు ఈ కార్యక్రమంలో కంటి వైద్యాధికారి నరహరి తదితరులు ఉన్నారు.

స్వచ్ఛంద సంస్థకు విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న ఆశ్వపతి

వెంకటాపురం(కె): చేయూత స్వచ్ఛంద సేవ సంస్థకు మండల కేంద్రానికి చెందిన పలువురు విరాళం అందజేశారు. సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంకటాపురం, వాజేడు, మంగపేట మండలాల్లో పలువురికి రక్తదానం చేయటంతో పాటు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ భవిష్యత్‌లో మరికొన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు గాను జెడ్పీటీసీ పాయం రమణ రూ.5000, బాలసాని ఆశ్వపతి రూ.5000, మద్దాల వినోద్ రూ.3000లను సంస్థ అధ్యక్షుడు సాయి ప్రకాశ్‌కు అందజేశారు.

గ్రామసభ తీర్మానంతోనే పనులు చేపట్టాలి

మంగపేట: గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణం పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ సభ తీర్మానంతోనే చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు లొడె శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో స్థానిక ఎన్నికలు జరుగక ప్రజా ప్రతినిధులు లేక పోవడంతో పలు రాజకీయ పార్టీల నాయకుల గుత్తాధిపత్యం మితిమీరి పోయిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ నిధులు మంజూరు చేయగా కొందరు స్థానిక ప్రభుత్వం మంజూరు చేసిందని, మరి కొందరు ఎమ్మెల్యే నిధులు అని చెపుతూ అయా అధికారులపై ఒత్తిడి చేసి బెదిరింపులకు పాల్పడుతూ వారి ఇష్టానుసారంగా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

భూపాలపల్లి: జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే పూర్తి పారదర్శకంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తున్నామని, దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని కలెక్టర్ భవేష్ మిశ్రా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపు సాగుగా చూపిస్తూ అమాయక ప్రజల నుంచి కొంత మంది దళారులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దళారులకు ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. పూర్తి ఉచితంగా అర్హులను నిబంధనల మేరకు పారదర్శకంగా ఎంపికచేసి డబుల్ బెడ్ రూం ఇళ్లు అందిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా డబ్బులు అడిగినా, మోసగించాలని చూసినా వెంటనే కలెక్టర్ కార్యాలయంలో సమాచారం అందించాలని సూచించారు.

కుమారస్వామి మృతి తీరనిలోటు



మదనపల్లిలో నల్లెల సంతాప సభలో నాయకులు



మంగపేటలో..



ఎస్ఎస్ తాడ్వాయిలో..



ఏటూరునాగారంలో..

ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లెల్ల కుమారస్వామి మృతి పార్టీకి తీరని లోటని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని మదనపల్లిల గ్రామంలో నల్లెల సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి నల్లెల అందించిన సేవలను కొనియాడారు. యూత్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, ఆకుతోట చంద్రమౌళి, మామిడిశెట్టి కోటి, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, తిరుపతి, లక్ష్మీ, మోహన్, మధు, రాజన్నగౌడ్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు నల్లెల కుమారస్వామి సంతాప సభను సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జాలపు అనంతారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సీతక్క ఆదేశాలకు మేరకు సంతాప సభను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, సర్పంచులు ఈర్ప సునీల్, రేగ కల్యాణి, నర్సింహస్వామి, జిల్లా నాయకుడు ఆరెం లచ్చు పటేల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాక సాంబయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, నాయకులు సిద్దిరెడ్డి, రాజేందర్, చక్రపాణి, లింగయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లెల కుమారస్వామి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి ఆధ్వర్యంలో కుమారస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సోమయ్య మాట్లాడుతూ కుమారస్వామి భౌతికంగా దూరమైనప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తల గుండెల్లో ఎప్పటికి చిరంజీవిగా నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహారావు, మండల నాయకులు యానయ్య, నల్లెల కుమారస్వామి మృతి గవాస్‌రెడ్డి, చౌళం వెంకటేశ్వర్లు, సుధీర్, వెంకట్ రెడ్డి, అశోక్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లెల కుమారస్వామి సేవలు మరవలేనివని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఎదుట కుమారస్వామి సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా సాధనకు అహర్నిషలు కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, ఎంపీటీసీ శ్రీలత దేవేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, నాగమణి, రాధిక, నరేందర్, ఉమ్మగాని రమేష్, గౌస్ పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో బీసీ కులాలను చేర్చొద్దు

ఏటూరునాగారం: ఎస్టీ జాబితాలో బీసీ కులాలను చేర్చొద్దని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ తుడుందెబ్బ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏపీఓ వసంత రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. కులాలను కలుపుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం ఆదివాసీల హక్కులను కాలరాయడమే అవుతుందని అన్నారు. ఇష్టానుసారంగా కలిపితే సహించేది లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాయం జానకి రమణ, పొడెం బాబు, చింత కృష్ణ, ఎట్టి రాజబాబు, చిట్టిబాబు, సమ్మయ్య, సర్వేష్, వంక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పెసా గ్రామసభ

వాజేడు: మండల పరిధిలోని టేకులగూడెంలో రేపు(బుధవారం) ఉదయం ఎనిమిది గంటలకు పెసా గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసుకున్న భీరమయ్య, భీమేశ్వర, భీష్మశంకరుడు గిరిజన మహిళా ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్ట్ సొసైటీల నిర్వహణకు కలెక్టర్ ఆదేశాను సారం పెసాగ్రామ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆత్మ రక్షణకు కరాటే అవసరం



ప్రశంస పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ రమణ

వెంకటాపురం(కె): ఆత్మ రక్షణకు కరాటే అంతగానో దోహదపడుతుందని జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. మండల పరిధిలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో ఏటూరునాగారంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ వేసి, ప్రశంస పత్రాలను అందజేసి సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం నుంచి పాల్గొన్న 60 మంది విద్యార్థుల్లో 32 మంది గోల్డు మెడల్, 9 మంది సిల్వర్ మెడల్, 9 మంది బ్రజు మెడల్ సాధించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సోటోకాన్ అకాడమీ ఫౌండర్ పాయం సురేష్, కరాటే మాస్టర్ గొంది హనుమంతుతో పాటు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న సూర్య

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం మచ్చాపూర్ గ్రామానికి చెందిన వెంగల ప్రమీల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సీతక్క కుమారుడు సూర్య సోమవారం పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అనంతరం ప్రమీల మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాంనాయక్, కణతల నాగేందర్‌రావు, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సోమయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

పరిమితికి మించి తరలించొద్దు

వాజేడు: కూలీలను వాహనాల్లో పరిమితికి మించి తరలించొద్దని ఎస్సై రేఖఅశోక్ అన్నారు. మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలను చేపట్టారు. బొలెరో వాహనంలో ఎక్కువ మంది కూలీలను తరలిస్తుండటంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరో ఐదు ఆటోల్లో కూడా ప్రయాణికులను పరిమితికి మించి తరలిస్తుండటం గుర్తించారు. ఆటోలతో పాటు బొలెరోపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వాహనాలను కూడా జాగ్రత్తగా నడపాలని సూచించారు.

జనసేన పార్టీలో సభ్యత్వం పొందాలి



పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న పవన్

ఏటూరునాగారం: జనసేన పార్టీలో ప్రతి ఒక్కరూ క్రియాశీల సభ్యుడిగా చేరాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పవన్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. రూ.500లు చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందాలన్నారు. దీనివల్ల జీవిత బీమా రూ.5లక్షలు, ప్రమాద బీమా రూ.50వేలు వర్తిస్తుందన్నారు.